# ఋగ్వేద

ప్రొఫెసర్ ఎస్. ఎస్. రామచంద్రమూర్తి

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

వేదకథాభారతి - 12

# ఘోష

రచన

ప్రొఫెసర్ ఎస్. ఎస్. రామచంద్రమూర్తి

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య

ప్రచురణ

డాక్టర్ ఐ.వి.సుబ్బారావు, ఐ. ఏ. ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 12

**GHOSHA**

by

***Professor S.S. Ramachandra Murthy***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by :

***Dr. I.V. Subba Rao, I.A.S.,***
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price :

*Lasertypeset at*
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R.S. Gardens, Tirupati ✆ : 30184

*Printed at*
**MUDRICA OFFSET PRINTERS**
Sanyasiraju St., Gandhi Nagar
Vijayawada ✆ : 579654

# మామాట

**డాక్టర్ ఐ. వి. సుబ్బారావు,** ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేదాలు. మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందరో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి.

''ఆహా ! ఎటువంటి కర్తవ్యదీక్ష! ఎంత విశాలదృష్టి! ఎటువంటి విశ్వకల్యాణభావన! ఎంతటి ధార్మిక చేతన!'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది. ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -

**ఈ వేద కథా భారతి.**


వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?

ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను.

ఇంత చక్కగా ముద్రించిన అన్నపూర్ణ గ్రాఫిక్స్ వారికి అభినందనలు.

జయతు జయతు భారతీ

వేద కథా భారతీ



# మనవి

వేద కథాభారతి.


అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా నిండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన స్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది. సస్యశ్యామలం చేసింది. సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవనానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి. అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి.

ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించచడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాథి - నిజజ్యేష్ఠ
బహుళ - సప్తమి
5-7-1999

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య



# ఘోష

వేదాలు నాలుగు. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం; అథర్వవేదం. వీటిలో ఋగ్వేదం ప్రాచీనతమమైనది. వేదాలు అపౌరుషేయాలు. నిత్యమైన వేదం తపస్సిద్ధులైన మహనీయుల మనస్సులో ప్రకటమైనదని, కనుకనే వారు ఋషులైనారని యాస్కాచార్యులు తమ నిరుక్తంలో ప్రవచించారు. అంటే, ఋషులు మంత్రద్రష్టలే కాని మంత్రకర్తలు కారన్నమాట. వేద మంత్రద్రష్టలలో ఎందరో స్త్రీలు ఉన్నారు. వారిని ఋషీకలు అంటారు. గార్గి, మైత్రేయి, అపాల, ఇంద్రాణి, రోమశ, శ్రద్ధ, యమి, సూర్య, సావిత్రి, ఘోష ఈ కోవకు చెందినవారు. మంత్రద్రష్టలైన విశ్వామిత్రాది మహర్షులవలెనే వీరూ పూజనీయులు.

వీరిలో ఘోష ప్రజవంశీయుడైన కక్షీవంతుని కుమార్తె. ఈమె ఋగ్వేదం దశమ మండలంలోని కొన్ని సూక్తాలని దర్శించి ఋషీక అయింది.

**అలౌకిక సౌందర్యనిలయం ఆ ఆశ్రమం :**

అది కక్షీవంతుని ఆశ్రమం. అలౌకికమైన అందంతో అలరారుతున్నాయి ప్రతిమొక్క, చెట్టు, పశువు, మృగం- ఒకటేమిటి సమస్తం. నిరంతరవేదనాదం, హోమధూమం, నియమనిష్ఠలతో కూడిన జీవనం, అడుగడుగునా ధర్మబద్ధత. కక్షీవంతుని పాండిత్యం, సౌజన్యం, ధర్మపరత, శిష్యవాత్సల్యం జగద్విదితం. సమిధలు చేత ధరించి సంప్రదాయబద్ధంగా విద్యను అర్థించి అతడివద్దకు వచ్చిన ఏ శిష్యుడూ నిరుత్సాహియై మరలిపోలేదు. కక్షీవంతుడు, అతడి పత్ని శిష్యులను

కన్నబిడ్డలవలె వాత్సల్యంతో, ప్రేమతో చూచుకొనేవారు. శిష్యులకు వారిద్దరూ దేవతామూర్తులు. ఆ ఆశ్రమం, వారికి సకల దేవతలూ అనుగ్రహించి విచ్చేసిన పవిత్ర ప్రాంగణం. ఇటువంటి ఆశ్రమప్రదేశం అలౌకికసౌందర్యంతో శోభిస్తూ ఉండటంలో ఆశ్చర్యం ఏముంది! అక్కడి ముని బాలకులు, బాలికలు వారి తల్లిదండ్రుల ధర్మబద్ధ ప్రణయఫలాలు. వారి ముఖాలలో, ఆటపాటలలో ముగ్ధసౌందర్యం వెల్లివిరుస్తున్నది. విచిత్రం ఏమంటే, వేదనాదంతోను, పండితులు, సహృదయులు అయిన మహర్షుల జిజ్ఞాసాపూరితమైన చర్చలతోను, చిన్నారుల ఆటపాటలతోను, శిష్యుల విద్యావ్యాసంగంతోను నిరంతరం కోలాహలంగా ఉన్నాకూడా ఆ ఆశ్రమం ప్రశాంతరమణీయంగా ఉంటుంది.

**అందరికీ ఆ చిన్నారితో ఆడుకోవాలనే :**

కక్షీవంతుని కుమార్తె ఘోష. అందాల అపరంజి బొమ్మ ఆ బాల. అందరూ ఆ చిన్నారి అందానికి అబ్బురపడేవారే. ఆ అమ్మాయితో ఆడాలని, పాడాలని ఆశపడేవారు బాల బాలికలు. ఆమె దగ్గరకు వస్తే చాలు మాధవీలతలూ, మల్లె, సన్నజాజితీగలూ పోటీపడి ఆమెని పూలవర్షంతో ముంచెత్తేవి. మామిడి చెట్టుకి ఆమె అంటే ముద్దు కాబోలు వంగి మరీ తియ్యటి ఫలాలని అందించేది. చిన్న చెంబుతో, బుడిబుడి నడకలతో, చిన్నారి ఘోష ప్రతిమొక్కకీ, చెట్టుకీ నీళ్ళు పోస్తుంటే అవి ఆనందంగా ఊగుతూ ఆమె ఫాలం మీది చిరుచెమట ఆరేలా, అలసట తీరేలా మెలమెల్లగా గాలిని వీచేవి.

ఆ బాల ఆశ్రమం బయట తిరుగుతూ ఉంటే అక్కడి లేడి కూనలూ, లేగదూడలూ ఆమె చుట్టూ పరుగులు పెట్టేవి, 'మమ్మల్ని పట్టుకో' అన్నట్లు. ఘోష వాటి వెంట పరుగెత్తలేక బుంగమూతి పెట్టేది.

'ఆ బుంగమూతి చూసి జాలి పడ్డాయా' అన్నట్లు అవి ఆమె దగ్గరకు చేరి, ఆమెను ఒరుసుకొని నిల్చేవి. ఆమె ఆప్యాయంగా వాటి నోటికి లేత పచ్చిక అందించేది. ఆ లేత పచ్చిక తిని అవి మళ్ళా పరుగులు మొదలు పెట్టేవి. ఆమె కూడా వాటి వెనక పరుగెత్తేది. ఆ పరుగెత్తటంలో ఒత్తైన ఆమె జుట్టు గాలికి ఎగురుతుంటే, దానిని నల్లటి మబ్బు అనుకొని నెమలి పురివిప్పి ఆనందంగా నృత్యం చేసేది.

చీకటిపడితే శుక్లపక్షపు వెన్నెల్లో వెన్నెలకుప్పలూ, కృష్ణపక్షపు రాత్రులలో చుక్కలకాంతిలో కాళ్ళాగజ్జాలూ ఆడుకొనేది ఘోష తన స్నేహితురాళ్ళతో. ఎంత అలసిపోయినాసరే, విశ్రమించే ముందు దైవప్రార్థన చెయ్యటం ఆ చిన్నారికి తప్పనిసరి కార్యక్రమం. ఆ బాల దైవప్రార్థన చేస్తుంటే అంత చిన్న గొంతుకలోనూ సంగీతం అలలలాగా కదిలిపోయేది, భక్తిభావం ఉప్పొంగిపోయేది. 'ఈ చిన్నారి పాప వయసుకి ఇంత మధురమైన సంగీతం ఏమిటి! ఈ భక్తి పారవశ్యం ఏమిటి!' అని అందరూ ఆశ్చర్యపోయేవారు.

**తమ ఇంటి కోడలైతే ఎంత బాగుంటుంది!**

ఘోష క్రమంగా పెరిగి పెద్దది అవుతున్నది. ఎదుగుతున్న ఘోష మూర్తీభవించిన సౌందర్యంగా, రూపెత్తిన వినయమూర్తిగా అందర్నీ అలరిస్తున్నది. తన తండ్రి కక్షీవంతుని వద్దనే విద్య అభ్యసిస్తున్నది. ఆమె ఏకాగ్రతకు, కుశాగ్రబుద్ధికి, గ్రహణపటుతకు, విమర్శనశక్తికి అందరూ ఆశ్చర్యపోయేవారు. తాను అధ్యయనం చేయటమేకాదు, అధ్యయనం చేసిన దానిని సహపాఠులతో చర్చించటం, ఒక్కొక్కసారి జటిలమైన విషయాన్ని కూడా అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు వారికి బోధించటం చూసిన పండితమహర్షులు కక్షీవంతునితో -

*''మహర్షీ! నీవు ధన్యుడవు. ఘోష సాక్షాత్తు సరస్వతీమూర్తి. ఆమె వల్ల నీవు, నీ వంశం ప్రఖ్యాతి పొందుతారు''*

అని అతడిని హృదయపూర్వకంగా అభినందించేవారు. ఘోషని చేరపిలిచి, ఆమె మూర్ధాన్ని ముద్దుగొని, మనసారా ఆశీర్వదించేవారు.

ఎందరు ఎంత ప్రశంసించినా ఆమెలో వినీతభావం, జిజ్ఞాస మరింత పెరిగేవి కాని అహంకారపు ఛాయకూడా కనపడేది కాదు. అందుకే ఆశ్రమంలోని పెద్దలందరికీ ఆమె అంటే అమిత వాత్సల్యం; సమవయస్కులకి అభిమానం, ఆరాధన. పసిపిల్లలకి, చిన్నారులకి ఆమెలో ఒక అక్క కనిపించేది, అక్క పంచి ఇచ్చే ప్రేమ కనిపించేది. అపూర్వమైన అనురాగమూర్తి ఆమె.

ఘోష ఇప్పుడు అద్భుత సౌందర్యమూర్తి. ప్రకృతిలోని అందాలన్నీ ఆమెలో అలౌకికసౌందర్యంతో అలరారుతున్నాయి. ప్రత్యూష పవనాంకురాల మార్దవాన్ని, శరత్కాలపు వెన్నెలలోని కాంతిని కలబోసిన శరీరం, వర్షాకాలపు మెరుపుల లావణ్యం, కాసారంలోని కమలాలవైపు ఒయారంగా ఈదుకుంటూ పోయే రాయంచల విలాసం ఆమెను చూసిన వారిలో అనురాగంతో కూడిన ఆరాధనభావాన్ని కలిగిస్తున్నాయి. ఆమె సౌందర్యంలో అంతర్లీనంగా ఉన్న ధార్మికసౌందర్యం వలన ఆమె ఒక పరమరమణీయమైన ప్రకృతిమూర్తిగా భాసిస్తున్నది.

ఘోషని చూసిన వారిలో ఎన్నో భావాలు, ఆశలు రేకెత్తేవి మునిపత్నులు -

*''ఘోష ఎవరింటికి వెళ్తుందోగాని ఆ ఇల్లు దైవీసంపదతో, అలౌకిక అనురాగబంధాలతో, పిల్లాపాపలతో నిత్యం కళకళలాడుతూ ఉంటుంది''*

అనుకొనే వారు. యువకులు

''ఘోషకు భర్తగా ఆమె తల్లిదండ్రులు ఎవరిని ఎన్నుకొంటారోగాని అతడిని మించిన అదృష్టవంతుడు ఉండబోడు''

అనుకొనేవారు.

ఇక ఆ యువకుల తల్లిదండ్రులు. సాధారణంగా ప్రతిరాత్రి హోమాదికాలు నిర్వర్తించి, భగవత్ప్రసాదాన్ని స్వీకరించి, విశ్రమించి ఉన్న ఋషితో ఋషిపత్ని తమ కుమారుడి వివాహప్రస్తావన తీసుకువచ్చేది -

''మన చిరంజీవి విద్యాభ్యాసం ముగించుకొని, స్నాతకుడై, వివాహయోగ్యుడై ఉన్నాడుగదా! నా మనసులో మాట చెప్తున్నాను. ఘోష మన ఇంటి కోడలైతే మనం గృహభారాన్ని నిస్సంకోచంగా ఆమెకు ఒప్పగించి నిశ్చింతగా వానప్రస్థానికి సిద్ధం కావచ్చు. మన అబ్బాయికి అన్నివిధాల తగినది. విద్యకు విద్య, అందానికి అందం, వినయానికి వినయం అన్నీ ఉన్న సమర్థురాలు. ధర్మమూర్తి అయిన ఆమె కోడలైతే మన గృహదేవతలు, పితృదేవతలు కూడా సంతోషిస్తారు. ఏమంటారు?''

అనేది ఋషిపత్ని, భర్త పాదసంవాహనం చేస్తూ.

''నిజమే. నాకూ ఆ భావనే ఉన్నది. అయితే వివాహప్రస్తావన సముచితసమయంలో, సరైన రీతిలో ఘోష తల్లి దండ్రులవద్దకు వచ్చేట్లు చూడాలి. కొంచెం ఓపిక పట్టు'' అనేవాడు ఋషి.

విశ్రమించిన ఋషి పత్నికి- ఘోష తమ ఇంటి కోడలైనట్లు, ఆమెకు పుత్రుడు జన్మించినట్లు, తాను పౌత్రుడితో కొంతకాలం ఆనందంగా కాలక్షేపంచేసి, ఐహిక బంధాలను తొలగించుకొని భర్తతో కలిసి

వానప్రస్థంలో మోక్షసాధనకు పూనుకొన్నట్లు - కలలు వచ్చేవి.

ఇది వివాహయోగ్యులైన యువకులు ఉన్న ప్రతి ఆశ్రమంలో జరుగుతున్న విషయం.

**గృహిణిని కావాలి :**

ఆశ్రమవాటిక కోలాహలంగా ఉంది. ఘోష కూడా చాలా సంబరంగా ఉంది. తన ప్రాణస్నేహితురాలి వివాహం. శిష్యులు, మహర్షులు వివాహవేదిక వద్ద అవసరమైన వస్తుసామగ్రి సమకూర్చుకొంటున్నారు. ఋషిపత్నులు మహర్షులకు కావలసిన వస్తువులు అందిస్తున్నారు. కొందరు పాకశాలలో ఉన్నారు. వధువు స్నేహితురాళ్ళు ఆమెను అలంకరిస్తూ, పరియాచకాలాడుతున్నారు. వారి సందడికి ఘోష నాయకురాలు. సుగంధపుష్పాలతో, పత్రాలతో, ఆభరణాలతో వధువును అలంకరిస్తున్నారు. ఘోష వధువును తదేకంగా చూస్తున్నది -

*''తన స్నేహితురాలేనా ఈమె! ముఖంలో ఒక వింత కాంతి, అపూర్వమైన సౌందర్యశోభ! చెక్కిళ్ళు నునుసిగ్గుతో రాగరంజితాలై ఉన్నాయి. చిగురుటాకులవంటి అధరాలు ఉండి ఉండి కంపిస్తున్నాయి తుమ్మెదరెక్కలు తగిలిన పూల రేకులలాగా. కళ్ళు కలల్లో తేలిపోతున్నాయి. పెళ్ళికళ అంటే ఇదే కాబోలు! ఎంత కొత్తగా ఉంది ఈమె సొబగు! వివాహం అనే భావన యువతిలో ఇంత మార్పు తీసుకొని వస్తుందా!''*

*'' ఏమిటే ఘోషా! స్వప్నలోకాల్లో విహరిస్తున్నట్లున్నావు! వివాహం నీకా? మన స్నేహితురాలికా?''*

వేళాకోళం ఆడింది ఘోష స్నేహితురాళ్ళలో ఒకామె.

ఉలిక్కిపడి, భావనా ప్రపంచం నుంచి స్పృహలోకి వచ్చి, మృదువుగా నవ్వేసింది ఘోష.

వివాహవేదికకు తీసుకొనివచ్చారు వధువును. వివాహప్రక్రియ అయిదురోజుల వేడుక. ఆ అయిదు రోజులు ఘోష నిజంగానే స్వప్నలోకాల్లో విహరించింది.

తన స్నేహితురాలు అత్తవారింటికి వెళ్ళింది. అక్కడి విశేషాలు అప్పుడప్పుడూ ఘోషకి చేరవేస్తున్నారు ఆమె స్నేహితురాళ్ళు. ఘోషలో కూడా యువతీసహజమైన కోరికలు, ఆశలు మేల్కొన్నాయి.

'తన యౌవనాన్ని, సౌందర్యాన్ని తన పతికి సమర్పించాలి. ప్రణయగానంలో ఈ లోకాన్ని మరిచిపోవాలి'. ఊహాలోకాల్లో తేలిపోతున్న ఘోష ఉలిక్కిపడింది. మగలేడి ఆడులేడిని తన కొమ్ముకొనతో మృదువుగా గీరుతూ, ఒరుసుకొని నడుస్తున్నది. ఆడులేడి నడక మరీ వయ్యారంగా ఉన్నట్లనిపించింది ఆమెకి. ఆ వయ్యారపు నడకలో ఆడులేడి ఆమెని చూసుకోకుండా తాకింది. ఫలితంగా ఘోష ఈ లోకంలోకి వచ్చింది. ఆ లేళ్ళజంటని చూసి చిరునవ్వు నవ్వుకొంది. ఎదురుగా ఉన్న వృక్షశాఖమీద చిలుకల జంట కేరింతలాడుతున్నది. 'మగ చిలుక మరీ చిలిపిదిలా ఉంది' అనుకొంది సిగ్గుగా.

పక్కన ఏదో బరువుగా కదిలినట్లనిపించి అటు చూసింది ఘోష. పూర్ణగర్భ అయిన కృష్ణసారంగం బరువుగా, అలసటతో నెమ్మదిగా నడుస్తున్నది. దాని దగ్గరకు వెళ్ళి మెత్తటి పచ్చికని దాని నోటికి అందించి, దానిని నెమ్మదిగా నిమిరింది. ఆమె అందించిన పచ్చికని నెమ్మదిగా నములుతూ అది ముందుకు సాగింది.

ఘోష మళ్ళీ స్వప్నలోకంలోకి వెళ్ళింది.

'తన్మూ, తన పతి ప్రణయమాధుర్యాన్ని తనివితీరా అనుభవిస్తారు. ధర్మాన్ని అతిక్రమించని తమ దాంపత్యానికి ప్రతిఫలంగా పుత్రుణ్ణి ప్రసాదిస్తాడు భగవంతుడు. ఆ చిన్నారి శిశువుని చూసి తన భర్త మురిసిపోతాడు. తనని మరింతగా ప్రేమిస్తాడు. తన మాతృత్వాన్ని గౌరవిస్తాడు. తను వంశాంకురమైన ఆ పసిబాలుణ్ణి తన హృదయానికి హత్తుకుంటుంది. తన ప్రాణధారతో పెరుగుతాడు వాడు. వాడి ఆట పాటలు చూసి, చిన్నారి చిలిపి చేష్టలు చూసి ఆశ్రమవాటికలో అందరూ వాణ్ణి ఎంతగానో ముద్దు చేస్తారు. తనని ఆదర్శగృహిణి అని అంతా మెచ్చుకొంటారు?'

*''ఘోషా! చీకటి పడుతున్నది తల్లీ! లోపలికి వచ్చి మీ తండ్రిగారికి హోమానికి కావలసినవి అందించమ్మా''.*

తల్లి పిలుపు విన్న ఘోష ఇహలోకంలోకి వచ్చింది. తన ఊహలకు తానే సిగ్గుపడి పర్ణశాలలోకి దారితీసింది.

ఆ రాత్రి కక్షీవంతుని పత్ని తన భర్తదగ్గర కుమార్తె వివాహప్రస్తావన తీసుకు వచ్చింది. కక్షీవంతుడు యోగ్యుడైన వరుని చూసి ఘోషకు వివాహం చేయాలని సంకల్పించాడు. ఆ మాటే చెప్పాడు తన పత్నితో.

**విధి ఎంత క్రూరమైనది !**

బ్రాహ్మముహూర్తంలో లేచిన కక్షీవంతుడు ప్రభాతకాల యోగ్యమైన వేదగానంతో దినచర్య ఆరంభించాడు. రోజూ తాను లేవక ముందే మేల్కొని, స్నానాదికాలు నిర్వర్తించుకొని, దైవప్రార్థనలో మగ్న అయ్యే ఘోష ఇంకా నిద్రిస్తూనే ఉండటం అతనికి ఆశ్చర్యం కలిగించింది.

*''అమ్మా! ఘోషా! ఇంకా లేవలేదేం తల్లీ!''*

అంటూ ఆమెని సమీపించి వాత్సల్యంతో ఆమె నుదుటిపై చేయి వేశాడు. వేస్తూనే చేతిని తటాలున వెనక్కి తీసుకొన్నాడు, నిప్పు సెగ సోకినట్లు. ఆమె శరీరం జ్వరతాపంతో కాలిపోతున్నది. వెంటనే ఆమె నాడిని పరీక్షించాడు. అతడి భృకుటి ముడిపడింది, మనస్సులోని ఆందోళన ఆ స్థానంలో ఘనీభవించినట్లు. కొద్దిసేపు ఆలోచించాడు శుచియై పర్ణశాల పెరట్లో ఉన్న ఓషధీవనంలోకి వెళ్ళి, సముచితమైన ఓషధీసూక్తాల్ని పఠిస్తూ, ఓషధీలతలకు, మొక్కలకు నమస్కరించి అవసరమైన పత్రాదుల్ని సేకరించాడు.

పర్ణశాలలోకి వచ్చి ఔషధం సిద్ధం చేసి ఘోష చేత దానిని తాగించాడు. ఔషధాన్ని సేవించటానికే అతి కష్టంమీద లేచిన ఆమె, నీళ్ళులేక వాడిపోయిన కలువకాడలా శయ్యమీద వాలిపోయింది.

క్రితం రాత్రివరకూ ఉల్లాసంగా ఎన్నో విషయాలను గురించి చర్చించి, ఆ తర్వాత ఆనందంగా శయనించిన తమ కుమార్తె తెల్లవారేసరికి ఈ విధంగా అనారోగ్యంపాలవటం ఆమె తల్లిదండ్రులకు బాధకలిగించింది. కక్షీవంతుడికి ఆమె పరిస్థితి ఆందోళన కలిగించినా, తన పత్నిముందు అతడు బయటపడలేదు. ఘోష చేత ఔషధసేవ చేయించి అతడు పద్మాసనాసీనుడై ధ్యానమగ్నుడయ్యాడు.

**ఏమీ భయంలేదు :**

మధ్యాహ్నం అయింది. ఘోష తల్లి తన కూతురివద్దనే కూర్చొని ఉంది, దిగులుగా కూతుర్ని చూస్తూ. ఘోష తండ్రి ధ్యానం నుండి లేచి కూతురి వద్దకు వచ్చి ఆమెను పరిశీలనగా చూశాడు. అతడిలో ఆందోళన అధికమయింది.

''అమ్మాయికి ఏమయిందండీ! పొద్దుటి నుండి మూసిన కన్ను

తెరవలేదు. అలాగే పడుకొని ఉంది. నాకేమిటో భయం వేస్తున్నది. అది పుట్టిన దగ్గరనుండి ఎప్పుడూ ఇలా లేదు. బొంగరంలా తిరిగే పిల్ల...'' దుఃఖంతో ఘోష తల్లి కంఠం గద్గదమైంది. అశ్రువులు ధారగా కారుతున్నాయి.

*'' ఏమీ భయంలేదు. అమ్మాయిని జాగ్రత్తగా చూస్తుండు. ఇప్పుడే వస్తాను''*

అంటూ కక్షీవంతుడు ఆశ్రమం బయటికి నడిచాడు.

**చిరంజీవినిని ఒకసారి చూద్దాం!**

గబగబ నడిచి సమీపంలో ఉన్న వైద్యుడి కుటీరానికి వెళ్ళాడు అతడు. ఆ భిషగ్వరుడు వృద్ధుడు, తేజశ్శాలి, అమృతహృదయుడు, అమృతహస్తుడు, అమృతమూర్తి. కక్షీవంతుడు ఆయన పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసి, తన కూతురి అనారోగ్యం గురించి, తానిచ్చిన ఔషధం గురించి ఆయనకు విన్నవించాడు. తన ఆందోళనని దాచుకోలేక పోయాడతడు. కూతురి పరిస్థితి వివరిస్తూ ఉంటే అతడి కంఠం గద్గదమైంది.

సావధానంగా విన్న ఆ వైద్యుడు,

*''పద, కక్షీవంతా! చిరంజీవినిని ఒక సారి చూద్దాం''*

అన్నాడు.

*''స్వామీ! అవితథవాక్కులైన తమ నోటినుండి అమ్మాయి విషయంలో 'చిరంజీవిని' అన్న పదం వచ్చింది. మీ మాట వ్యర్థం కాదు. అది తమ ఆశీర్వచనమే. ఇంక నాకు దిగులు లేదు''*

అని భక్తితో, ఒకింత కలతతీరిన మనస్సుతో ఆయనకు నమస్కరించాడు కక్షీవంతుడు.

ఏమీ జవాబు చెప్పకుండా కక్షీవంతుడి ఇంటికి దారి తీశాడు భిషగ్వరుడు. కక్షీవంతుడు ఆయనను అనుసరించాడు.

**మృత్యుభయంలేదు :**

ఘోషని క్షుణ్ణంగా పరిశీలించాడు వైద్యుడు. అతడికి ఆశ్చర్యం కలిగింది. తన ఇన్ని సంవత్సరాల అనుభవంలో ఇటువంటి వ్యాధిని ఏనాడూ చూడలేదు. వ్యాధి మూలం అంతుపట్టటంలేదు. అమ్మాయి రాత్రి పడుకోబోయేవరకూ ఆనందంగా, ఉల్లాసంగా ఉన్నదని, అనారోగ్యచిహ్నాలేవీ గోచరించలేదని, తెల్లవారి లేచి చూచేసరికి ఆమె పరిస్థితి ఇలా ఉన్నదని అంటున్నారు ఆమె తల్లిదండ్రులు. ఘోష ఏమీ మాట్లాడే స్థితిలో లేదు. ఘోష పసిపిల్లగా ఉన్నప్పటినుండి తనకి తెలుసు. ఆమె సౌమ్య మనఃప్రవృత్తి, నియమనిష్ఠలు, చక్కని ఆరోగ్యం తనకు తెలియనివికావు. 'సత్త్వగుణమే కాని రజస్తమోగుణాలు ఈ బాలికలో వెతకినా కానరావు. సౌభాగ్యవతి ఈమె' అని తను ఎన్నోసార్లు అనుకొన్నాడు. ఇప్పుడు పగలు రెండు జాములు దాటింది. కక్షీవంతుడు ఉదయం పరిశీలించినప్పటి ఆమె ఆరోగ్యపరిస్థితికి, ఇప్పటిస్థితికి ఎంతో మార్పు కనిపిస్తున్నది. ఆమె ఆరోగ్యం ఈ రెండుజాముల వ్యవధిలోనే ఇంతగా ఎందుకు దిగజారినట్లు? అదీకాక, మరొక ముఖ్యమైన మార్పు- ఈ కొద్ది సమయంలోనే ఆమె శరీరం ఎందుకు ఇలా ముడతలు పడిపోతున్నది? కాంతిహీనమైపోతున్నది. ఈ వ్రణ చిహ్నాలేమిటి? ఇది ఎటుదారితీస్తుంది? ఈ ప్రశ్నలకు భిషగ్వరుడికి ఎంత ఆలోచించినా సమాధానం లభించలేదు.

*''కక్షీవంతా! అమ్మాయికి వచ్చిన వ్యాధి అసాధారణమయింది. అయితే మృత్యుభయంలేదని ఘంటాపథంగా చెప్పగలను. ఇతర*

*వైద్యమిత్రులతో కూడ సమాలోచించి చికిత్స ప్రారంభిద్దాం. ఆమె త్వరగా కోలుకోవాలని, ఆమె ఆరోగ్యం యథాపూర్వస్థితికి రావాలని భగవంతుణ్ణి ప్రార్థిద్దాం''*

అన్నాడు భిషగ్వరుడు.

అతడి మాటల్లోని ఆంతర్యం అర్థం అయింది కక్షీవంతుడికి.

**ఎంత దారుణమైన శిక్ష !**

వృద్ధులు, నియమనిష్ఠాగరిష్ఠులు, సహృదయులు, అత్యంత సమర్థులు, అనుభవశాలులు అయిన వైద్యులు ఘోషకు చికిత్స చేశారు. సుదీర్ఘకాల చికిత్సతో ఘోష ప్రాణాలు దక్కినాయి. భిషగ్వరుడు సెలవిచ్చినట్లు ఆమె 'చిరంజీవిని'. అయితే, 'ఆమె ఆరోగ్యం యథాపూర్వస్థితికి రావాల'ని వారు చేసిన ప్రార్థనలు మాత్రం భగవంతుడి చెవినపడలేదు; చెవిలో పడినా ఆయన అనుగ్రహించలేదేమో!

ఇప్పుడు ఘోష మునుపటివలె సౌందర్యవతికాదు. ఆమె బాహ్యసౌందర్యాన్ని వ్యాధి మింగేసింది. ఆమె దేహం శిథిలం అయిపోయింది. శిరస్సుపై కేశాలు అక్కడక్కడ ఉన్నాయి. అవీ జీవకళలేని పలితకేశాలు. ఆమె విశాలనేత్రాలలో కాంతిలేదు. దట్టమైన పొగలో ఉన్న దీపాలవలె ఉన్నాయి అవి. పాదాది ఫాల పర్యంతం శరీరం ముడతలు పడిపోయింది. ముడతలు పడి ఉన్న శరీరం మీద అక్కడక్కడా దుర్గంధభూయిష్ఠమైన వ్రణాలు. వ్యాధిగ్రస్తయైన ఆమె, రాక్షసబాధలకు తాళలేక ఋషులు వదిలి వెళ్ళిపోగా, పాడుపడిపోయిన ఆశ్రమం వలె ఉంది.

*'' ఎలా ఉండే ఘోష ఎలా అయిపోయింది! ఆమె ఏం పాపం చేసిందని భగవంతుడు ఇంత దారుణమైన శిక్ష విధించాడు? ఆమె పాపం చేసి ఉంటుందనే భావన రావటానికే వీలు లేదు. ఈ*

*జన్మలో కాదు, ఏ జన్మలోనూ పాపచ్ఛాయ ఎరగని ధర్మమూర్తి ఘోష. ఆమే ఇలా అయిందంటే విధి ఎంత క్రూరమైంది''*

అనుకొన్నారు ఆశ్రమవాసులంతా. ఘోష తల్లి దండ్రులకంట తడి ఆరినట్లు చూసినవాళ్ళే లేరు.

**కాలం భారంగా కదిలిపోతున్నది :**

ఘోష జీవితాన్ని భారంగా ఈడుస్తున్నది. ఆమె తల్లిదండ్రులు తమ కుమార్తె మీది చింతతోనే కాలగర్భంలో కలిసిపోయారు. ఒకప్పుడు ఘోషతో ఆడుకోవాలని, మాట్లాడాలని ఉవ్విళ్ళూరిన చెలికత్తెలందరూ వివాహాలు చేసుకొని అత్తవారిళ్ళకు వెళ్ళి పోయారు; బిడ్డల తల్లులయ్యారు కూడ. కాలం భారంగా కదిలిపోతున్నది ఘోషకు. ఇప్పుడు ఆమెకు మిత్రులు, ఆప్తులు ఎవరూలేరు. శూన్యగృహంలో మసకబారిన దీపంలా ఆ ఆశ్రమంలో ఆమె ఒంటరి జీవితాన్ని గడుపుతున్నది.

ఇప్పుడు ఆమెకు అరవై సంవత్సరాలు. చూతవృక్షం కింద కూర్చొని గతాన్ని తలపోసుకుంటున్నది. తన భవిష్యత్తు ఏమిటని బాధపడుతున్నది. తనకు ఇప్పట్లో మరణం రాదు. అది తథ్యం. అందుకని ఆత్మహత్యకు పాల్పడలేదు. అది మహాపాతకం. అదీ కాక ఆత్మహత్యకు పాల్పడేటంత పిరికిదికాదు తను.

అది శిశిరఋతువు. ఆకులన్నీ రాలిపోయి చెట్లు మోడులై నిలిచి ఉన్నాయి.

*'అవీ తన లాగానే ఉన్నాయి'*

అనుకొన్నది ఘోష.

*'మోడు వారిన చెట్లు తనలాగా ఉండటం ఏమిటి? వాటి ఆకులు రాలిపోవటం, అవి మోడు వారటం ఋతుధర్మం. ఇప్పుడు*

మోళ్ళుగా ఉన్న ఈ చెట్లే రేపు వసంతం వచ్చేసరికి మళ్ళీ చిగుళ్ళు తొడిగి మన్మథరథాల్లా ఉంటాయి. ఇప్పుడు ఎండిపోయినట్లున్న ఈ మాధవీలతే మరి కొద్ది రోజుల్లో పూలతో నిండి సిగ్గులొలకబోస్తున్న నవోఢలా ఉంటుంది. మరి తన బ్రతుకుకు వసంతం ఏదీ?

తను ఎన్నటికీ చిగురించని చెట్టులా నేలకొరిగి పోవలసిందేనా?'

ఇలా ఏవేవో ఆలోచనలతో పరాకుగా ఉన్న ఘోష దగ్గరకి లేడి కూనవచ్చి మూచూసింది. ఆమె నెమ్మదిగా కదిలి ఆ కూనని దగ్గరకు తీసుకుని లాలించింది.

'ఈ లేడి కూన తన దగ్గర పెరిగిన లేడికి పుట్టింది. తను నాటిన మొక్కలు చెట్లై ఫలాలను అందిస్తున్నాయి. తను పెంచినగోవులు, లేళ్ళు, నెమళ్లు అన్నీ సంతానంతో కళకళలాడుతున్నాయి. తన బ్రతుకే ఇలా వ్యర్థం అయిపోతున్నది. అందరివలె తనకూ వివాహం చేసుకోవాలని, ప్రణయమాధుర్యాన్ని అనుభవించాలని, సంతానంతో ఆనందించాలని, పతిసేవలో తరించాలని ఉండదా? కడదాకా ఇలా కాలాన్ని భారంగా వెళ్ళదీయవలసిందేనా? మార్గాంతరం లేదా?'

ఘోష మనస్సు ఇంతకుముందు ఎన్నడూ లేనంతగా బరువెక్కిపోయింది. తుపాను సమయంలో కడలితరంగాలలాగా శోకం ఆమెని కుదిపివేసింది.

**కోరిక తీరే మార్గం ఉంది :**

మనస్సులో ఎంత వేదన ఉన్నా జన్మతః వచ్చిన సంస్కారం, తల్లిదండ్రుల శిక్షణ, నేర్చినవిద్య, పెరిగిన ఆశ్రమవాతావరణం ఆమెను తపశ్చర్యవైపు మళ్ళించాయి. నిత్యం నియమబద్ధంగా తపస్సులో నిమగ్న

అయి చిత్తశాంతిని పొందటానికి కృషి చేస్తున్నది. కాని, ఆమె కూడా మానవమాత్రురాలే కదా! వ్యర్థంగా గడిచిపోతున్న జీవితాన్ని, కఠిన వ్యాధిగ్రస్తమైన తన శరీరావస్థనీ తల్చుకొని ఆమె నిర్వేదం పొందటం అసహజం ఏమీ కాదు.

అలా తీరని శోకంతో, సహించలేని వేదనతో ఉన్న ఘోష మనస్సులో ఏదో మెరుపు మెరిసినట్లయింది.

*'అవును. తన తండ్రి కక్షీవంతుడు కూడ ఒకసారి తీవ్రవ్యాధిగ్రస్తుడయ్యాడు. అప్పుడు అశ్వినీదేవతలను ప్రసన్నం చేసుకొని వ్యాధినుండి విముక్తిని పొందాడు. ఇప్పుడు తానూ అదేపని చెయ్యాలి.'*

ఘోషకు కొంత ఊరట కలిగింది.

*'తనకు ఈ విషయం జ్ఞాపకం రావటానికి ఇంతకాలం పట్టిందా? తాను ఈ దురవస్థను ఇంతకాలం అనుభవించాలని బ్రహ్మ తన లలాటాన లిఖించాడు కాబోలు'.*

ఇక ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా తన తండ్రి మార్గాన్ని అనుసరించాలని నిశ్చయించుకొన్నది.

**అశ్వినీదేవతలు అనుగ్రహించారు :**

ఘోష ఆశ్రమం నుండి కదిలి, భారంగా అడుగులు వేస్తూ, అతికష్టంమీద దగ్గరలో ఉన్న నదీతీరాన్ని చేరింది. నదిలో ఎలా దిగగలిగిందో, శిశిర ఋతువు చలిలో రుజాగ్రస్త అయిన తను ఆ నదిలో ఎలా స్నానం చేయగలిగిందో, ఎలా తిరిగి ఆశ్రమానికి చేరుకోగలిగిందో ఆమెకే తెలియదు. ఏదో దైవీశక్తి ఆమె చేత ఆ పనులన్నీ చేయించింది.

ఆశ్రమానికి వచ్చి దర్భాసనం మీద పద్మాసనం వేసుకొని కూర్చొని, కళ్ళుమూసుకొన్నది. ' ఏమని ప్రార్థించాలి? ఎలా ప్రార్థించాలి?'

ఆమెకు మొదట ఏమీ అర్థం కాలేదు. కాని కళ్ళు మూసుకొని అలాగే ఏకాగ్రచిత్తంతో కూర్చొని ఉన్నది. క్రమంగా ఆమెలో బాహ్యస్మృతి తొలగిపోయింది. అంతర్ముఖి అయింది. ఆమె ప్రమేయంలేకుండానే, ఆమె హృదయకుహరంలో నుండి అశ్విని దేవతాకమైన సూక్తులు వెలువడుతున్నాయి. తన మనోనేత్రంతో ఆ సూక్తులను దర్శించగలుగుతున్నది.

*'ఎంత మనోహరంగా ఉన్నాయి ఆ సూక్తులు! ఇంత అద్భుతమైన సూక్తుల్ని తన హృదయకుహరంలోనుండి వెలువరచి, తన మనోనేత్రం ముందు ఉంచుతున్న ఆ అగోచరశక్తి ఎవరు? తను ఆ సూక్తుల్ని అంత స్పష్టంగా ఎలా దర్శించగలుగుతున్నది? అన్నిటిని మించి తన కోర్కెలని సఫలం చేయమని ఆసూక్తులు అంత అందంగా ఎలా ఆవిష్కరించగలుగుతున్నాయి?*

*ఈ ఇద్దరు అలౌకిక సౌందర్యమూర్తులు ఎవరు? ఒకే రూపంతో, ఒకే తేజస్సుతో పరమ సౌమ్యమూర్తులై, అమృతమూర్తులై ఉన్నారు. వీరు కవలలా? వీరేనా అశ్వినీ దేవతలు?'*

*''ఘోషా! మేము అశ్విని దేవతలం. నీ ప్రార్థనకు సంతుష్టులమై నీ కోరికలు నెరవేర్చటానికి వచ్చాం. కళ్ళు తెరు''*

అన్నారు ఘోషముందు సాక్షాత్కరించిన ఆ దేవవైద్యులు.

ఘోషకు బాహ్యస్మృతి వచ్చింది. నేత్రాలు తెరిచింది. అశ్వినీ దేవతలను చూచింది. నమస్కరించి -

''నా జన్మ ధన్యం అయింది. నేను ఏమీ ప్రార్థించకనే నాయందు కరుణించారు మీరు. నా హృదయకుహరంలో నుండి మీ స్తుతిపరమైన సూక్తాలు వెలువడినాయి. వాటిని నేను నా మనోనేత్రంతో విస్పష్టంగా దర్శించాను. అంతేకాని ఆ సూక్తులు నా రచనలు కావు. ఈ ప్రక్రియలో నా ప్రమేయమే లేదు. నేను మిమ్ములను స్తుతించకనే వరాలిమ్మని ఎలా కోరేది?'' అని వినమ్రంగా ప్రశ్నించింది.

''ఘోషా! వేదసూక్తులు అపౌరుషేయాలు. వాటిని దర్శించగలగటమే మహాభాగ్యం. ఆత్మజ్ఞానం కలవారికే అది సాధ్యం. ఘోషా! ఇన్ని సంవత్సరాలుగా నియమనిష్ఠలతో నీవు చేసిన తపస్సు ఫలించింది. నీకు బాహ్య సౌందర్యం లేకపోవచ్చు. కాని తపఃఫలితంగా ఆత్మజ్ఞానసౌందర్యాన్ని పొందగలిగావు. కనుకనే మంత్రద్రష్టవు కాగలిగావు. ఇప్పుడు మేము నీకు యౌవనాన్ని, బాహ్యసౌందర్యాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నాము. అంతేకాదు, ఘోషా! నీకు పతిని, సంతానాన్ని కూడ అనుగ్రహిస్తున్నాము. ఋషీకా! నీవు ధన్యజన్మవు''

అని ఆమెను ఆశీర్వదించి అంతర్ధానం అయ్యారు అశ్వినీదేవతలు.

★★★

కాలం గడిచింది. ఆమె జీవితంలో ఎన్నో శుభపరిణామాలు చోటుచేసుకున్నాయి.

**నన్దామ శరదశ్శతం; మోదామ శరదశ్శతం**

నల్లగా, ఒత్తుగా, సుగంధ భరితమైన ఆమె కేశరాశి హోమధూమాన్ని పోలి ఉన్నది. ఆమె శరీరకాంతి హోమాగ్నుల

అరుణకాంతిని తలపిస్తున్నది. లావణ్యం, ఎగసిపడుతున్న హోమాగ్ని జ్వాలతో సన్నగా పడుతున్న స్వచ్ఛమైన ఆజ్యధార మెరుపు వలె ఉన్నది. వేదోక్తంగా, అత్యంత శ్రద్ధతో నిర్మించబడిన యజ్ఞవేదికవలె పవిత్రంగా, మనోహరంగా ఉన్నది ఘోష. లౌకిక, అలౌకిక సౌందర్యాలు మధువు, క్షీరం వలె కలిసి ఉన్నాయి ఆమెలో.

ఘోష పక్కన కూర్చొని ఉన్నాడు ఆమెపతి, ఆమెవంకే ఆరాధనగా చూస్తూ. శ్రద్ధగా నిర్వహించబడిన యజ్ఞఫలం వంటి వారి కుమారుడు కురంగశాబకంతో ఆడుతున్నాడు.

''ఒకప్పుడు నా బ్రతుకుకి 'జీవమ శరదశ్శతం' మాత్రమే వ్రాసిపెట్టి ఉంది అనుకొన్నాను. కాని ఇప్పుడు సంతోషంగా-

నన్దామ శరదశ్శతమ్

మోదామ శరదశ్శతమ్'

అని అనుకోగలుగుతున్నాను అన్నది ఘోష తన భర్తతో. అతడు చిరునవ్వుతో అన్నాడు -

'తథాస్తు'

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

❀ ❀ ❀

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

CENTENARY CELEBRATIONS OF SRI VENKATESWARA VEDA PATHASALA

DHARMAGIRI

&

VEDA AGAMA SILPA SADAS

5-7-1999 To 8-7-1999